## క్లుప్తంగా

### గోశాల ప్రారంభం



**కొత్తకోట రూరల్:** మండలంలోని అల్వాలలో జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గోశాలను ప్రారంభించారు. ఆదే గ్రామానికి చెందిన రాములు అనే గోరక్షకుడు తన సొంత స్థలంలో గోశాల ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన గోమాతను పూజించాలని, గోవుకు సేవ చేసే ప్రతి ఒక్కరికి మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణ, వెల్టూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మామిడి రైతులకు అవగాహన సదస్సు

**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని రైతులకు మామిడి తోటల సాగుపై అవగాహన కల్పించేందుకు మంగళవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు మన గ్రోమోర్, పెబ్బేరు సెంటర్ మేనేజర్ సుబ్బారాయుడు, మామిడి తోటల రైతు ట్యూషన్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి మదనాపూరం కేవీకే హార్టికల్చర్ శాస్త్రవేత్త సురేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

### 26న వీడియోగ్రాఫర్ల సమావేశం

**కొల్లాపూర్:** నియోజకవర్గ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం సమావేశం ఈ నెల 26న కొల్లాపూర్‌లో నిర్వహించనున్నట్లు ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం జిల్లా ముఖ్య సలహాదారు కట్టా శ్రీనివాసులు ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు షబ్బీర్ తెలిపారు. సమావేశానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నేతాజీగౌడ్ హాజరవుతారన్నారు. ఫొటో గ్రాఫర్లకు ఇళ్ల, స్థలాలు, ఇన్సూరెన్సు వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

### 28న మండల సర్వసభ్య సమావేశం

**పెద్దకొత్తపల్లి:** మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలన్నారు.

### అయోధ్య రాముడి కరపత్రాలు విడుదల



**పెంట్లవెల్లి:** మండలంలోని మల్లేశ్వరం, యంగంపల్లి తండా, మంచాలకట్ట గ్రామాల్లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో యువకులు మల్లేశ్వరంలోని అయోధ్య రాముడి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ మండలాధ్యక్షుడు పల్లె శివ మాట్లాడారు. ప్రతి గ్రామంలోని ఆలయాల్లో శ్రీరాముడి అక్షతలు అందించి పత్రాలు విడుదల చేయడం జరుగుతుందని, అంతే కాకుండా ఆ అక్షతలను ప్రతిఇంటికి పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ అయోధ్య రాముడిని దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పల్లె శివ, స్వాములు, పోతుల కిరణ్ తేజ్, గంగాధర్, శివ తదితరులు పాల్గొన్నారు.

### రైతు రుణమాఫీ అమలు చేయాలి

**కొల్లాపూర్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతులకు రూ.2 లక్షల మేరకు రుణమాఫీని అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ కోరారు. సోమవారం కొల్లాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు సమావేశమయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రైతుబంధు డబ్బులు అకౌంట్లలో జమ చేస్తామని చెప్పారని, ఇప్పటి వరకు రైతులకు రైతుబంధు డబ్బులు జమ చేయలేదన్నారు. ఈ నెల 28 నుంచి ప్రజాపాలన పేరుతో నిర్వహించే గ్రామసభలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో నాయకులు చంద్రునాయక్, కిరణ్‌కుమార్, తారాసింగ్, బత్తిని రాజు, బాలునాయక్, సంజీవ్ తదితరులున్నారు.





గోపాల్‌పేటలో..



వీపనగండ్లలో..



పాన్‌గల్‌లో..



మూలమళ్లలో..

# శాంతిస్వరూపుడు ఏసుక్రీస్తు



కొత్తకోటలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి

**వనపర్తి టౌన్:** ఏసు ప్రభువు సర్వమానవాళిపై ప్రేమ కలిగి ఉన్నాడని, దేవుడిపై విశ్వాసంతో జీవించాలని పాస్టర్లు స్టీవెన్ ప్రకాశ్, ఎస్ఎం జానప్ప, మరియప్ప, యేసన్న, తిమోతి, కృష్ణపాల్ ఆయా చర్చిల్లో క్రైస్తవులకు ఉద్బోధించారు. జిల్లాలోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏసు కీర్తనలు చేస్తూ సర్వమానవాళి క్షేమం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిల్లో కేక్‌లు కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లా కేంద్రంలోని కల్వరి టౌన్ చర్చి ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వోలీవ చర్చిలో కాంగ్రెస్ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణాధ్యక్షుడు చీర్ల విజయచందర్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు తినిపించారు. కార్యక్రమంలో గంధం రంగస్వామి, యాకోబు, ప్రసాద్, కేశవులు, గిద్యోను, జయమన్యం, సుకన్య, రోనాల్డ్, ప్రేమలీల, పీడీ కలనందం, పీడీ జయనందం, క్రైస్తవ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు, నాటికలు**

దైవంపై ప్రేమ కలిగి ఉన్నప్పుడే ఏసు యొక్క గొప్పతనం అర్థం అవుతుందని పాస్టర్లు ప్రబోధించారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని పలు ముఖ్యమైన చర్చిల్లో క్రిస్మస్ పండుగ వేళ చిన్నారుల ప్రదర్శనలు అందరినీ అబ్బురపరిచాయి. ఏసు పుట్టుక ఇతివృత్తం తెలిపే నాటికలు, ఏసు ప్రభువు ప్రజలపై చూపే జాలి, కరుణ, దయ, క్షమాగుణాలు తెలియజేసే పలు నాటికలు ప్రదర్శించారు. ఏసు గీతాలపనలకు చిన్నారులు చేసిన నృత్యప్రదర్శనలు అదరహో అనిపించాయి.

**ఆత్మకూర్:** పట్టణ కేంద్రంతో పాటు మండలంలో మూలమళ్ల, రేచింతల, ఖానాపూర్, పిన్నంచర్ల, తూంపల్లి, జూరాలలోని చర్చిలో పాస్టర్లు ప్రత్యేక సందేశం ఇచ్చారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

**కొత్తకోట రూరల్:** శాంతి స్వరూపుడు ఏసు క్రీస్తు అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని ఎంబీ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. మండల కేంద్రంతో పాటు పాలెం, వడ్డెవాట, కానాయపల్లి, మిరాసిపల్లి, రాయిణిపేట గ్రామాల్లో క్రిస్మస్ సందర్భంగా ఉదయం నుంచి ఆయా చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కొత్తకోటలోని పలు చర్చిలో యేసు క్రీస్తు జననం, జీవిత చరిత్ర గురించి పాస్టర్లు సందేశం చేశారు. అనంతరం ఒకరికొకరూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు బోయేజ్ నివాసంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీను, ప్రశాంత్, కృష్ణారెడ్డి, బోయేజ్, మిషేక్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సుభాష్, సురేష్ ఉన్నారు.

**పాన్‌గల్:** మండలంలో క్రిస్మస్ వేడుకలను చర్చిల్లో సోమవారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్‌లు కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ అమర్‌కుమార్ ప్రార్థనలకు హాజరై క్రైస్తవులకు దైవ సందేశం వినిపించారు. మండల కేంద్రంతో పాటు వెంగళాయిపల్లి, మాందాపూర్, గోప్లాపూర్, రేమద్దుల, కేతేపల్లి తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో చైర్మన్ దయామని, క్రైస్తవులు పాల్గొన్నారు.

**వీపనగండ్ల:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను సోమవారం పలువురు ఘనంగా నిర్వహించారు. మండలంలోని తూంకుంట, గోవల్‌దిన్నె, గోవర్ధనగిరి తదితర గ్రామాల్లోని చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. , కార్యక్రమంలో పాస్టర్లు హెర్నియా, అన్నమ్మ, గోపల్‌దిన్నె చర్చిలో పాస్టర్ జాన్‌వెస్లీ ఏసు బోధనలు వినిపించారు. కార్యక్రమంలో మండల కేంద్రంలోని చర్చిలో పాల్గొన్న ఎత్తం కృష్ణయ్య, డీలర్ బస్వరాజ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గోపాల్‌పేట:** ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో సోమవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. గోపాల్‌పేట, చెన్నారం, గొల్లపల్లి, చీర్కపల్లి, రేవల్లి, తల్పునూరులోని చర్చీల్లో ప్రత్యే ప్రార్థనలు చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

పెబ్బేరు రూరల్: శ్రీరగాపురం, పెబ్బేరు, వనపర్తి మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. రంగుల లైట్లతో చర్చీలను అందంగా ముస్తాబు చేశారు. క్రైస్తవులు చర్చీలకు వెళ్లి పత్యేక ప్రార్థనలు చేశారు.

మదనాపురం: మండల కేంద్రంతో పాటు గోపన్‌పేట, అజ్జకొల్లు, కొన్నూర్, నర్సింగాపూర్, దుప్పల్లి, రామన్‌పాడ్ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

### బీఆర్ఎస్ కార్యాలయంలో..



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కల్వరి టౌన్ చర్చి పాస్టర్ స్టివేన్ ప్రకాశ్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి ప్రార్థనలు నిర్వహించగా.. క్రిస్మస్ కేక్‌ను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కట్‌చేసి క్రైస్తవ సోదరులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో హింస, దోపిడి, నియంతృత్వం పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న వేళ రోమన్ సామ్రాజ్యంలో బెత్లహెం గ్రామంలో ఏసు జన్మించి నియంతృత్వానికి చరమగీతం పలికారని వివరించారు. త్యాగం, ప్రేమ, కరుణ, అహింసకు ప్రతిరూపం ఏసుక్రీస్తు అని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లోక్‌నాథ్‌రెడ్డి, బి.లక్ష్మయ్య, రమేష్‌గౌడ్, గులాం ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో..



చీర్కపల్లిలో..



వనపర్తిలో..



పామిరెడ్డిపల్లిలో..

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మామిడిమాడలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సర్పంచు తదితరులు

**ఖిల్లాఘనపురం:** పేదల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించడంతో పాటుగా లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకోవడానికి వికసిత్ భారత్ సంకల్పయాత్రను నిర్వహిస్తున్నట్లు సర్పంచులు వెంకటరమణ, మోహన్ తెలిపారు. సోమవారం మండలంలోని మామిడిమాడ, ఖిల్లాఘనపురంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని లబ్ధిదారులకు, ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని వినిపించడంతో పాటు వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ, అంగన్‌వాడి కేంద్రాలు, వ్యవసాయం, విద్య, పారిశుద్ధ్యం తదితర పలు శాఖల ద్వార ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. అనంతరం 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శులు రవితేజ, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

**ఆత్మకూర్:** పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులం దరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ శరత్, వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ అబ్బాస్‌అలీ అన్నారు. సోమవారం మండలంలోని మోట్లంపల్లి, ఆరేపల్లి గ్రామాల్లో వికాసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఉచిత వైద్యం, జన్‌ధన్, సురక్ష, కిసాన్‌సమ్మాన్ యోజన, అటల్‌పెన్షన్, ఆయుష్మాన్‌భారత్ తదితర పథకాల గురించి ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా అత్యాధునిక వ్యవసాయం గురించి క్లుప్తంగా వివరించారు.



మోట్లంపల్లిలో..

### దళితబంధు పథకాన్ని కొనసాగించాలి

**కొల్లాపూర్ రూరల్:** రాష్ట్ర వ్యాప్తంగా దళితుల అభ్యున్నతికి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన దళిత బంధు పథకాన్ని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని తెలంగాణ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నార్లాపూర్‌లో దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దళితబంధు తీసివేస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. దళిత బంధుతో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే దాదాపుగా లక్షలాది మంది దళితులు జీవనోపాధి పొందడం జరిగిందన్నారు. పది లక్షలతో లక్షణంగా బతుకుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం మంజూరు చేసిన యునిట్లను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో దండోరా నాయకులు పాల్గొన్నారు.



## గ్రామ సమస్యలు పరిష్కరించండి

**పాన్‌గల్:** మండలంలోని రేమద్దులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఏదుట్ల వయా రేమద్దుల మీదుగా సింగోటం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, గ్రామ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి నిర్మాణం పనులను చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారం తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మంత్రికి పూల మొక్కను అందజేశారు. కార్యక్రమంలో నిరంజన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లికి పూల మొక్కను అందజేస్తున్న రేమద్దుల నాయకులు

### ధనుర్మాస పూజలు

**కొల్లాపూర్:** కొల్లాపూర్‌లోని రామమందిరం, మాధవస్వామి దేవాలయం, బండాయిగుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుఝామున ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామమందిరంలో మహిళలు కుంకుమార్చన చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. పూజలను భక్త బృంద కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



## ‘కార్యకర్తలకు అండగా ఉంటా’

**ఆత్మకూర్:** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందామని అధైర్యపడకుండా రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళ్దామని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు నివాసంలో మండలంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నైతిక విజయం సాధించిందని, కార్యకర్తల కృషి ఫలితంగానే తనకు 58 వేల ఓట్లు లభించాయన్నారు. రానున్న స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, ఎంపీపీ బంగారు శ్రీను, శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ శివరంజని, విండో అధ్యక్షులు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్, వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

## రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**పెబ్బేరు రూరల్:** వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఆదివారం షోటోఖాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలో పెబ్బేరు మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు దుర్గ, ఇంద్ర, దీక్షిత, దీపిక, అర్చన, గాయత్రి, అక్షయ, మౌనిక, భార్గవి, రజియా కతాస్ విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు మాస్టర్ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జయరాములు బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను, మాస్టర్ ఆంజనేయులును అభినందించారు. అలాగే వీపనగండ్ల మండలం కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు పూజ, నందిని, సుహాసిని, ప్రియాంక, చంద్రిక, స్నేహ, మల్లేశ్వరి, స్వప్న, పల్లవి, నీరజ, అధశ్వని, హారిక, వరలక్ష్మి, మాధవి కతాస్, స్పారింగ్‌లో బంగారు పతకాలు సాధించినట్లు మాస్టర్, ఎస్ఓ అరుణ, పీఈటీ లక్ష్మి తెలిపారు.



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

# వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడు



ఆత్మకూర్‌లో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**వనపర్తి టౌన్:** వాజ్‌పేయి జనసంఘ్‌లో పనిచేసి బీజేపీని దేశంలో బలోపేతం చేసి రెండు సార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము గుర్తుచేశారు. వాజ్‌పేయి జయంతిని సోమవారం పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బచ్చు రాము మాట్లాడుతూ.. వాజ్‌పేయి వేసిన పునాదులకు ప్రస్తుతం బీజేపీ 300 సీట్ల వరకు ఎదిగి, 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉందని చెప్పారు. అంతకుముందు ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షులు సీతారాములు, సుమిత్రమ్మ, బుడ్డన్న, కుమారస్వామి, మోహన్ సాగర్, నాయకులు రాములు, రాయన్న సాగర్, సుబ్రహ్మణ్యం, బాలరాజు, వెంకట్, బొడ్డుపల్లి వెంకట్, కొండన్న, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూర్:** మాజీ ప్రధాని అటల్‌బిహారీవాజ్‌పేయి హయాంలో కనీవిని ఎరుగని రీతిలో దేశం అభివృద్ధి చెందిందని బీజేపీ కౌన్సిలర్లు అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన అనంతరం వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రేచింతల శ్రీను, నాగేందర్, రాజు, ఎల్లన్న, భీంరెడ్డి, గోపాల్, గాడిశేషు, రఘు, రాము, సూరి, చందు, లక్ష్మినారయణ, తదీతరులు పాల్గొన్నారు.

**ఖిల్లాఘనపురం:** దివంగత మాజీ ప్రధాని అటల్‌బిహార్‌వాయిజేయి గొప్ప రాజనీతిజ్ఞుడు అని నాయకులు కొనియాడారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో మండల బీజేపీ అధ్వర్యంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు ఆశన్న మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరవలేనివన్నారు. ఆయన అజాత శత్రువుగా, సుపరిపాలన స్ఫూర్తి ప్రదాతగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనను భారతరత్నతో సత్కరించారని గుర్తుచేసుకున్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

**పెబ్బేరు రూరల్:** మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీవాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని మండలంలోని రంగాపురంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాఘవేంద్రగౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు భగవంతుయాదవ్, ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు మరళీధరాచారి, గోవిందునాయుడు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో..



రంగాపురంలో..